# నేరం లేని శిక్ష!

కల్యాణి తేజ

రాత్రి తొమ్మిదైంది.

భోజనం ముందు కూర్చున్న భుజంగరావు మొహం చిట్లించాడు మోటుగా.

డైనింగ్ టేబుల్ పక్కన నిలబడ్డ సుభద్ర మూతి మూడు వంకర్లు తిప్పింది.

"ఏం కూర ?" అన్నాడు భుజంగరావు దూకుడుగా.

"కనబడ్డంలా ? – సొరకాయ పాలు పోసి వండిన కూర" అన్నది సుభద్ర దురుసుగా.

"నిన్నగాక మొన్న సొరకాయ వేపుడు ; నిన్న పొద్దున సొరకాయ పులుసు ; నిన్న రాత్రి సొరకాయ పచ్చడి ; ఇవాళ పొద్దున సొరకాయ కూర్మా... ఈ పూట ఇదీ ! ఇదేమైన సొరకాయ వారమా ?" అన్నాడు భుజంగరావు విసుగ్గా.

"ఇది బాగానే ఉందండోయ్ ! నన్నేం చేయమంటారు ? నేనేమైనా రూపాయలు గుమ్మరించి సొరకాయ గంప కొన్నానా ? ధరలు సీమటపాకాయలా మండే ఈ కాలంలో ఎవరో పుణ్యాత్ములు దానధర్మంగా ఇచ్చిన కూరగాయలను ఒక్కటికి పదిసార్లు తినడానికి అట్లా గుసుస్తారేమిటి ? అన్నది సుభద్ర అర్ధగజం దీర్ఘందీస్తూ.

"సొరకాయలు దానం చేసే ఆ పుణ్యాత్ముడెవరే !"

"ఈ వీధి చివర నాయుడుగారు లేరూ !... ఆయన ! దొడ్లో విపరీతంగా కాస్తున్నాయట. ఈ వారంలో రెండు కాయలు పంపించారు – గుమ్మడికాయంతవి. మార్కెట్‌లో కొనాలంటే ఒక్కొక్కటి రూపాయిన్నరకు తక్కువ రాదు. ఏమనుకొంటున్నారో ఏమో !"

భుజంగరావు మళ్లీ నోరుఎత్తకుండా భోజనంచేశాడు. ఆ తర్వాత నాయుడి గారింటికి కోపంగా ఫోనుచేశాడు.

"హల్లో !... నాయుడుగారా !... నమస్కారం !... ఆఁ !...అవునండీ ! ఇప్పుడే అయింది భోజనం – మీ సొరకాయ కూరతో ? అది సరేగాని, రోజూ సొరకాయ కూర తినలేక చస్తున్నాను. ఒక వారం రోజుల పాటు సొరకాయలు పంపడం మానేయకూడదూ ?"

అవతలనుంచి జవాబు :

"చంపేశారు బాబూ ! మీ బోటి వాళ్లకు సొరకాయలు పంపకపోతే, మా ఆవిడ ముప్పొద్దులా సొరకాయ కూరే మా మొహాన కొడుతూంది స్వామీ ! ఆ బాధనుంచి తప్పించుకోవడానికే ఈ ఏర్పాటు చేశాను. మీరు క్షమించాలి మరి.

భుజంగరావు గబుక్కున ఫోను కింద పెట్టేశాడు.